


# మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా

- మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి
- 9వ డివిజన్ బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీలో పర్యటించిన తుంగతుర్తి రవి
- మౌలిక వసతుల స్థితిగతులపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్న రవి

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ మేడిపల్లి పరిధిలోని బీపీఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీలో తుంగతుర్తి రవి క్షేత్రస్థాయిలో పర్యటించారు. మున్సిపల్ ఏఈ సాయికిరణ్, కాలనీ నాయకులు, స్థానికులతో కలిసి ఆయన కాలనీ వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సాయికిరణ్, కాలనీ అధ్యక్షుడు మునికుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రావు నాగిరెడ్డి, కోశాధికారి మునికుంట్ల ప్రదీప్ గౌడ్, వివేకానంద రెడ్డి, సదానందం, యాదగిరి, ముదిగొండ రమేష్, వెంకటేష్ గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# యుడైస్ ప్లస్ నమోదు, డ్రాప్‌అవుట్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో జిల్లా విద్యాశాఖ అధికారుల సమీక్ష సమావేశం**



**ఉప్పల్, ఆగస్టు 4, ( రాజముద్ర న్యూస్ ):** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రేణుక మేడం, ఉప్పల్ మండల విద్యాధికారి (ఎంఈఓ) రామారావు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జాన్సన్ గ్రామర్ హైస్కూల్‌లో మండల పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యా పరిపాలనలో పారదర్శకత, యుడైస్ ప్లస్ డేటా నమోదు, ప్రభుత్వ నిబంధనల అమలు వంటి అంశాలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో డీఈఓ రేణుక మాట్లాడుతూ, పాఠశాలలు యుడైస్ ప్లస్‌లో నమోదు చేసే ప్రతి వివరాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థుల ప్రవేశాలు, హాజరు శాతం, డ్రాప్‌అవుట్ల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. తప్పులు లేదా ఆలస్యాలు జరగకుండా పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం జారీ చేస్తున్న జీవోలపై మార్గదర్శకాలు, విద్యాశాఖ ఆదేశాలపై పాఠశాలల యాజమాన్యాలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏవైనా పరిపాలనా సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని, వాటి పరిష్కారానికి విద్యాశాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ అప్ గ్రేడేషన్ ప్రక్రియను విజయవంతం చేయడానికి ప్రైవేట్ పాఠశాలలు పూర్తి సహకారం అందించాలని డీఈఓ కోరారు. పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎంఈఓ రామారావు మాట్లాడుతూ, మండలంలోని పాఠశాలలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే తెలియజేస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యుడైస్ ప్లస్‌లో డ్రాప్‌అవుట్ విద్యార్థుల వివరాలు వెంటనే నమోదు చేసి, డేటా ఖచ్చితత్వాన్ని కాపాడాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, విద్యాశాఖ అధికారులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. సమావేశం విద్యా రంగంలో సమన్వయాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# దివ్యాంగుల ఫిజియోథెరపీ క్యాంపు నిర్వాహణ

**ఎంఈఓ ఆనంద్ రావు**

**రామారెడ్డి, రాజ ముద్ర న్యూస్:** రామారెడ్డి మండల భవిత దివ్యాంగుల పాఠశాల యందు ఫిజియోథెరపీ క్యాంపు మండల విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి శారీరకవైకల్యం గల తీవ్రంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి వచ్చి డాక్టర్ అక్షయ్ కుమార్ సేవలు పొందడం జరిగింది డాక్టర్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామ చికిత్స చేసినట్లయితే వారి వైకల్యాన్ని కొంతవరకు తగ్గించి సాధారణ విద్యార్థులతో కలిసి తమ కార్యక్రమాలు నిర్వహించుకోగలరని దీనికి తల్లిదండ్రుల సహాయ సహకారం ఎంతో అవసరం అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కన్నాపూర్ హెచ్ఎం ఆనంద్ , సి ఆర్ పి మెహమూద్ , భవిత పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.




# నేరస్తుల పట్ల భారత ప్రభుత్వం కఠిన చర్యలు

**విదేశాలకు పారిపోయిన 274 మంది నేరస్తులను స్వదేశానికి తీసుకురావడంలో కీలక పాత్ర**




**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** 2021–2026 మధ్య 36 దేశాల నుంచి 274 మంది పరారీ నేరస్థుల తరలింపు విదేశాలకు పారిపోయిన నేరస్థులపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, అమిత్ షా మార్గదర్శకత్వంలో 2021 నుంచి 36 దేశాల నుంచి 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత దేశానికి తిరిగి తీసుకువచ్చారు. నేరస్థులకు తగిన శిక్ష పడేలా చూసేందుకు నరేంద్ర మోదీ 2018లో 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టాన్ని' తీసుకువచ్చారు. అమిత్ షా దిశానిర్దేశంలో పరారీ నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు, నేరస్థులను స్వదేశానికి రప్పించే ప్రక్రియను వేగవంతం చేసేందుకు సాంకేతికత, సమాచార సేకరణ ఆధారిత సమగ్ర వ్యవస్థను భారత్ అభివృద్ధి చేసింది.2014కు ముందు దేశంలో నేరస్థుల అప్పగింత వ్యవస్థ చాలా పాతబడిపోయి బలహీనంగా ఉండేది. ఆ సమయంలో భారత్‌కు కేవలం 37 దేశాలతో మాత్రమే అప్పగింత ఒప్పందాలు ఉండేవి. ఆర్థిక నేరస్థులను శిక్షించడానికి లేదా వారి ఆస్తులను జప్తు చేయడానికి ఎటువంటి ప్రత్యేక చట్టాలూ లేవు. 2004 నుంచి 2013 మధ్య కాలంలో ఏడాదికి సగటున కేవలం నలుగురు నేరస్థులను మాత్రమే భారత్‌కు తీసుకురాగలిగారు. అంతేకాకుండా 110 అప్పగింత విజ్ఞప్తులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. దీనికి తోడు అసంపూర్ణమైన పత్రాలు, నెమ్మదిగా సాగే ప్రక్రియ అప్పగింత వ్యవస్థను క్లిష్టతరం చేశాయి. దీనివల్ల తరచూ విదేశీ న్యాయస్థానాలు భారత్ అభ్యర్థనలను తోసిపుచ్చేవి. ఒకే నేరానికి రెండుసార్లు శిక్షించకపోవడం, రెండు దేశాల్లోనూ నేరంగా పరిగణించే చర్య వంటి న్యాయపరమైన అడ్డంకులు కూడా ఈ ప్రక్రియను ఆలస్యం చేసేవి. హోం మంత్రిత్వ శాఖ, ఇతర విభాగాల మధ్య సరైన సమన్వయం, ఏకీకృత వ్యూహం లేకపోవడం వల్ల పరారీలో ఉన్నవారిపై సమాచారాన్ని పంచుకోవడం, వారి ఆచూకీని గుర్తించడం, అంతర్జాతీయ అత్యవసర ప్రకటనలను జారీ చేయడం వంటివి కూడా నెమ్మదిగా సాగాయి. విదేశాలకు పారిపోయిన నేరస్థులను స్వదేశానికి రప్పించే అంశంలో గత ప్రభుత్వాలకు స్పష్టమైన ప్రణాళిక లేని నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం పరారీ నేరస్థుల అప్పగింతను ఒక 'జాతీయ ప్రాధాన్యత'గా మార్చింది. నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా అమిత్ షా పరారీ నేరస్థులపై మూడు సూత్రాల వ్యూహాన్ని (ప్రపంచవ్యాప్త చర్యలు, బలమైన సమన్వయం, చురుకైన దౌత్యం) అమలు చేస్తున్నారు. పరారీ నేరస్థుల అంశం దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థిరత్వం, శాంతిభద్రతలు, జాతీయ భద్రతలతో ప్రత్యక్షంగా ముడిపడి ఉందని అమిత్ షా స్పష్టం చేశారు. ప్రభుత్వం 2019లో జాతీయ దర్యాప్తు సంస్థ సవరణ చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక సవరణ చట్టాలను తీసుకువచ్చింది. దీని ఆధారంగా 2020 నుంచి పరారీ నేరస్థులను భారత్‌కు తీసుకువచ్చే ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టారు. దీని ఫలితంగా చట్టపరమైన చర్యలు కేవలం నిషేధిత సంస్థలకు మాత్రమే పరిమితం కాకుండా తీవ్రరూపం దాల్చాయి. విదేశాల్లో తిష్టవేసిన వ్యక్తిగత ఉగ్రవాదులు, వారిని నడిపించే వ్యక్తులు, నిధులను అందించే వ్యవస్థలు, సహాయక వ్యవస్థలను కూడా ఈ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో పరారీలో ఉన్నవారిని పట్టుకోవడం, వారి వ్యవస్థలను నిర్మూలించడంలో భారత్ సామర్థ్యం గణనీయంగా పెరిగింది.పరారీ నేరస్థులకు సంబంధించి ప్రత్యేక నిబంధనలను చేర్చుతూ ప్రభుత్వం 2024లో మూడు కొత్త నేర చట్టాలను అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని నిబంధనల ద్వారా తొలిసారిగా నిందితుడు హాజరుకాకపోయినా విచారణ జరిపే విధానానికి అవకాశం కల్పించారు. దీనివల్ల పారిపోయిన నిందితుడు కోర్టుకు హాజరుకాకపోయినా, అతనికి వ్యతిరేకంగా విచారణ నుంచి శిక్ష ఖరారు వరకు ఉన్న సమగ్ర న్యాయ ప్రక్రియను పూర్తి చేయడానికి వీలవుతుంది.

# విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**పొట్ల నరేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** గోపినగర్ ప్రభుత్వ పాఠశాలలో బీఆర్ఎస్ నాయకుడు పొట్ల నరేందర్ యాదవ్ 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ పౌరులని, విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నామని ఆత్మన్యూనతకు గురికావద్దని, పట్టుదలతో చదివి కలెక్టర్లు, డాక్టర్లు, పోలీసు అధికారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కే.ఎన్. రాములు, శంకర్ వాకిటి, నరసింహారెడ్డి, జంగయ్య, రియాజ్, నిరూప, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారం పాండవచెలక వాటర్ ట్యాంక్ శుభ్రం

**గ్రామస్థుల విన్నపంతో స్పందించిన గ్రామ సెక్రెటరీ**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలోని పాండవచెలక ప్రాంతంలో ఉన్న మంచినీటి వాటర్ ట్యాంకును గ్రామ సెక్రెటరీ రవి ఆధ్వర్యంలో ఆదివారం శుభ్రపరిచారు.గత కొన్ని నెలలుగా ట్యాంకు శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితమవుతుందని గ్రామస్థులు గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామసభలో ఇచ్చిన హామీ మేరకు ఈరోజు గ్రామ సెక్రెటరీ రవి సిబ్బందితో కలిసి వాటర్ ట్యాంకులో పేరుకున్న బురద, నాచును తొలగించి, క్లోరినేషన్ చేసి శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు సుల్తాన్, వీరబాబు, కొండమీద వెంకన్న మరియు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఇకపై ప్రతి నెలా వాటర్ ట్యాంకులను శుభ్రపరిచే చర్యలు తీసుకుంటామని గ్రామ సెక్రెటరీ రవి తెలిపారు.అధికారుల చొరవతో ట్యాంకు శుభ్రం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# శీనన్న ఆత్మీయ భరోసా.. ఆపదలో అభయహస్తం!



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఏదులాపురం మున్సిపాలిటీ : ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయి తీరని శోకంలో ఉన్న 45 నిరుపేద కుటుంబాలకు 'శీనన్న ఆత్మీయ భరోసా' కొండంత అండగా నిలిచింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బాధిత కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4,50,000 ఆర్థిక సాయాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరపున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో తమను ఆర్థికంగా ఆదుకున్న మంత్రి పొంగులేటికి, పీఎస్ఆర్ ట్రస్ట్‌కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.

# "బదలావ్ జరూరీ హై" నినాదంతో సిపిఐ పోరు

**ఆగస్టు 6 నుండి మండలంలో ప్రజా చైతన్య పాదయాత్రలు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ★సిపిఐ "బదలావ్ జరూరీ హై – మార్పు కావాలి" అనే నినాదంతో ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద పాదయాత్రల పోస్టర్ ను ఆవిష్కరించారు. సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా కేంద్ర ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందన్నారు. రైతుల పంటలకు ఎం ఎస్ పి కి చట్టబద్ధత కల్పించడంలో, కార్మికుల హక్కులు కాపాడడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆగస్టు 6 నుండి 14 వరకు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా చైతన్య పాదయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సెప్టెంబర్ 1న జరిగే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యమన్నారు.ఈ పోరాటంలో మండల ప్రజలు, రైతులు, కార్మికులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, కౌన్సిల్ సభ్యులు కాశబోయిన అయోధ్య, అనంతు పుల్లయ్య, వాసంశెట్టి వేంకటేశ్వర్లు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు

